ప్రజాశక్తి
మంగళవారం 9 మే 2023
5
అల్లూరి సీతారామరాజు



చిన్నారులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంధాలయంలో సోమవారం చిన్నారులకు వేసవి విడిది కార్యక్రమంలో భాగంగా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత ప్రారంభించారు. చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ అధికారిని సునీత మాట్లాడుతూ, గ్రంధాలయంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయానికి పంపించే విధంగా బాధ్యత తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది కే.సుబ్బారావు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే ఫాల్గుణకు నిరసన సెగ

- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై నిలదీత
- గో బ్యాక్ అంటూ గిరిజనులు, సిపిఎం, టిడిపి నేతల నినాదాలు



రోడ్డుపై బైఠాయించిన నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో బాగంగా సోమవారం బస్కి పంచాయతిలో పర్యటించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సిపిఎం, టిడిపి నాయకులు, మహిళలు నిలదీశారు. మూడేళ్ల కాలంలో గిరిజన ప్రాంతంలో ఏమి చేశారో చెప్పాలంటూ గిరిజనులు ప్రశ్నించారు. బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. గిరిజన ఎమ్మెల్యే అయ్యి గిరిజన జాతికి తీవ్రమైన ద్రోహం చేశారని నిలదీశారు. బస్కి పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా గడప గడప కార్యక్రమం పేరుతో గిరిజనులకు మోస పూరితమైన మాటలతో మభ్యపెట్ట వద్దని ప్రశ్నించారు. బస్కి పంచాయతీలో చేసిన అభివద్ధి ఏ ఒక్కటైనా చూపించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు నిలదీశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బస్కీ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో మంచినీరు, రోడ్డు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. రంగినిగుడ, కొంత్రాయిగూడ గ్రామాల్లో ప్రారంభించిన మంచినీటి పథకం అసంపూర్తిగా వదిలేశారని ఎందుకు పట్టించకోలేదని ప్రశ్నించారు.బొండగూడ గ్రామంలో పాఠశాల లేక పశువుల పాకలో విద్యాబోధన జరుగుతుందని మహిళలు తెలిపారు. పేద విద్యార్థులకు విద్య అందించే పాఠశాల భవనం నిర్మించలేని ప్రభుత్వం మనకు అవసరం లేదన్నారు.అరకువెళ్లి నుండి బస్కి పంచాయతీ వెళ్ళే దారి మరమ్మతులు చేపట్టాలని ఎన్ని సార్లు పిర్యాదు చేసిన ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. బోయ/ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించే తీర్మానాన్ని వ్యతిరేకించి ఆదివాసి గిరిజనుల వైపు నిలబడి పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా తమతో పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాంగి రాజు, పాంగి భీష్మ, సమర్డి బాబురావు, జి.రామన్న, గొల్లోరి అప్పలనాయుడు, కంజరితోట వార్డు మెంబర్ పాంగి బలరాం, పాంగి జగన్నాథం, టిడిపి నాయకులు కొర్రా మాణిక్యం, సమర్డి లైచోన్, కిండంగి సన్యాసి, వంతల గోపాల్ నాయుడు, సమర్డి ఆనంద్, రాజు, డొంబు, మదు, కిరణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

25 నుంచి రెండో దశ భూ సర్వే

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం రెండవ దశ భూముల రీ సర్వే ఈనెల 25 నుండి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సైన్డ్ భూములకు పట్టాల పంపిణీ, రీసర్వే, పివిటిజి ఓటరు నమోదు, ఫారం 6బి, ఫారం 7 సేకరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లో ఫారం బి 6 సేకరణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. డి పట్టా భూముల సేకరణపై ఎస్సైన్డ్ కమిటీకి, జిల్లా ఇన్చార్జి మంత్రికి నివేదించాలని సూచించారు. ఎస్సైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేయడానికి పట్టాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫైనల్ రికార్డు ఆఫ్ రైట్స్, ఫారం 13 నోటిఫికేషన్ జారీ, వెక్టరైజేషన్ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేసారు. రీ సర్వే, మ్యుటేషన్లు, డి పట్టా భూముల సేకరణపై తహాశీల్దారులు దృషి పెట్టాలన్నారు. భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తే ఆర్ఐ స్థాయి అధికారిని విచారణాధికారిగా నియమించాలన్నారు. లబ్దిదారునితో మాట్లాడి విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జెకెసి పోర్టల్‌ను తహాశీల్దారులు నిరంతరం పరిశీలించాలని చెప్పారు. వంద గ్రామాల్లో ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తి చేసారన్నారు. 142 గ్రామాల్లో ఫారం 13 నోటిఫికేషన్ పూర్తి చేసారని మిగిలిన గ్రామాల్లో నిర్దేశించిన సమయానికి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్పందన సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరి, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి.అంబేద్కర్, 22 మండలాల తహాశీల్దారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ జిల్లా టాపర్ జాహ్నవి శ్రీనిధికి

సిపిఎం అభినందన



శ్రీనిధిని అభినందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కూనవరం : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 588 మార్కులతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన జాహ్నవి శ్రీనిధిని సిపిఎం నేతలు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి, చక్కని ప్రతిభతో అద్భుత విజయం సాధించిన జాహ్నవి శ్రీనిధి, కష్టబడి చదివితే ఎక్కడున్నా విజయాలు సాధించవచ్చని నిరూపించిందని కొనియాడారు. వరదలతో మూడు నెలలపాటు తరగతులు జరగకపోయినా, తర్వాత ఎంతో కష్టబడి చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం ద్వారా పాఠశాలకు, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమన్నారు.

ఇంతటి విజయానికి కారకులైన ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. జాహ్నవి శ్రీనిధి భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీనిధి జాహ్నవిని అభినందించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, కొమరం పెంటయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు ఎంపిటిసిలు, సర్పంచులు ఆవుల మురళి, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, సీనియర్ నేత నాగరాజు ఉన్నారు.

రోడ్డు పనులతో ట్రాఫిక్ ఇక్కట్లు



మార్గం లేక నిలిచిపోయిన అనకాపల్లి, సీలేరు ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప ప్రధాన రహదారిపై సిసి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మెటీరియల్‌ను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వేస్తుండడంతో, దాన్ని సర్ది చదును చేసేవరకు వాహనరాకపోకలకు వీలులేకుండా పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం ప్రధాన రహదారిపై క్రషర్, మెటల్ కుప్పలు వేయడంతో, ఆర్‌టిసి బస్సులు, చివరకు బైక్‌లు కూడావెళ్లే మార్గంలేక దాదాపు అరగంట పాటు నిలిచిపోక తప్పలేదు.

సీలేరు వెళ్తున్న అనకాపల్లి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కూడా ఇలాగే నిలిచిపోయింది. తర్వాత జెసిబితో రోడ్డుపై వేసిన మెటీరియల్ కుప్పలను చదును చేసి, రాకపోకలకు వీలుగా మార్చడంతో వాహనాలు వెళ్లే వీలు కలిగింది. ఇరుకుమార్గంలో రోడ్డునిర్మాణ పనులు చేపట్టడం హర్షనీయమే అయినా, వాహనదారులు, ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హేండ్రి దునత్ జయంతి సందర్భంగా రెడ్ క్రాస్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ సుమిత్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, అధ్యక్షులు అభిషేక్ ఆదేశాల మేరకు కార్యవర్గ సభ్యులు రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సూర్యారావు, జయలక్ష్మి, మాట్లాడుతూ,రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిం చామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, ప్రమాదంలో ఉన్న వారిని రక్షించడం తదితర సేవా కార్యక్రమాలను రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా పలువురు వాలంటీర్లు పని చేస్తున్నారని తెలిపారు. రెడ్ క్రాస్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తీవ్రంగా కృషి చేస్తున్నారని సూచించారు. స్థానికంగా ఉన్న పేద మహిళలకు హైజిన్ కిట్స్, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, మాస్కులు, సుమారు 120 మంది మహిళలకు పంపిణి చేశారు. అంతకముందు రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుబ్రహ్మణ్యం, సంజీవ్‌రావు, కోఆర్డినేటర్ లోహితస్, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు



సర్వే చేపడుతున్న సిఐటియు నేతలు బాలదేవ్, తదితరులు

గ్రామాల్లో ఉపాధి పనులు పెంచాలి

- సిఐటియు ఆధ్వర్యాన శ్రామికుల జీవన స్థితిపై సర్వే

ప్రజాశక్తి-అరకులోయరూరల్: గ్రామీణ ప్రాంత శ్రామికుల జీవన విధానం స్థితి గతులపై మండలంలోని పెదలబుడు పంచాయతీ శరభగుడ గ్రామంలో సిఐటియు ఆధ్వర్యాన సర్వే నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, మండల సహాయ కార్యదర్శి కె.మగ్గన్న, నాయకులు సహదేవ్ బృందం ఇంటి ఇంటికి సోమవారం వెళ్లి వారి జీవన విధానం స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో శ్రామికులు, కార్మికులకు పనులు దొరక్క పస్తులు ఉండే పరిస్థితి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో చాలీచాలని కూలీలతో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఏడాది సరిపడా పనులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో కూలీ తక్కువగా ఉండడం, పనులు దొరకకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు.గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తి స్థాయిలో పని కల్పించ లేదని, పని చేసినా సకాలంలో కూలి అందలేదని తెలిపారు.గిరిజన ప్రాంతంలో పనులు దొరక్క మైదాన ప్రాంతంకు వలస వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. తక్షణమే ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచి రోజు కూలీ 600 రూపాయిలు పెంచాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిఇ రామం

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ పరీక్షల ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని పంచాయతీ రాజ్ డిఇ రామం కోరారు. గత పది రోజుల నుండి అరకువేలి గిరిజన సంఘం భవనంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, ఏపీ గిరిజన సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ పరీక్షలకు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. సోమవారం పంచాయతీ రాజ్ డిఇ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే వెనకబడిన ప్రాంతాలు అబివృద్ధి జరుగుతాయన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యా, వైద్యం వంటి సౌకర్యాలు ఎంతో అవసరమని తెలిపారు. శిక్షణ నిర్వాహకులు చిరంజీవి మాట్లాడుతూ, గత కొంతకాలంగా విద్యార్థులకు వివిధ ఎంట్రన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఉచితంగానే శిక్షణ అందిస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల ధర్నా

- సుప్రీం తీర్పు మేరకు కనీస వేతనం, గ్రాడ్యూటీ చెల్లించాలని డిమాండ్
- అడ్డతీగల సిడిపిఒ, సూపర్‌వైజర్ వేధింపుల వైఖరిపై నిరసన
- ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరేకు వినతిపత్రం అందజేత



సిఐటియు ఆధ్వర్యాన మహాధర్నాచేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -రంపచోడవరం : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లింపు, గ్రాడ్యూటీ అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా వైసిపి ప్రభుత్వం అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు చెల్లిస్తామన్న హామీని పూర్తిగామరిచిపోయిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం అంగన్వాడీలకు కనీస వేతనం, గ్రాడ్యూటీ అమలు చేయడం లేదన్నారు. అందరికీ వేసవి సెలవులిచ్చినా, మినీ అంగన్వాడీలకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వీరికి వేసవి సెలవులు వర్తింపజేయడంతోపాటు ప్రధాన అంగన్వాడీలతో సమానంగా వేతనం చెల్లించాలని కోరారు.


వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత టిఎ బిల్లులను పెండింగ్‌లో ఉంచిందని, టిఎ బిల్లు బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ అడ్డతీగల సిడిపిఒ కార్యకర్తల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని, సిడిపిఒ మాదిరిగానే వ్యవహరిస్తున్న అడ్డతీగల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు అందించారు.. దీనిపై పిఒ స్పందిస్తూ, ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యలపై నివేదించి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. సిడిపిఒ, సూపర్‌వైజర్ల వేధింపులపై వాళ్లను పిలిచి మాట్లాడు తానని, తదుపరి తగు చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. పిఒ హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రామలక్ష్మి, రాణి, రత్న కుమారి, బేబీరాణి, ప్రసున్న, సింగారమ్మ, మంగయమ్మ, ఉష, పుష్ప పాల్గొన్నారు



పిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ నేతలు

కూనవరం సర్పంచ్ రాజమ్మ మృతి

సంతాపం తెలిపిన సిపిఎం నేతలు, ప్రజాప్రతినిధులు



రాజమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- కూనవరం : మండల కేంద్రం కూనవరం మేజర్ పంచాయితీ సర్పంచ్ కట్టం రాజమ్మ అకాల మరణంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిపిఎం నేతలు, కార్యకర్తలు, పలువురు రాజమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌గా రాజమ్మ, పంచాయతీ పరిధిలోని అన్ని ఇళ్లను స్వయంగా సందర్శించి సమస్యలను తెలుసుకునే వారని, ప్రజా సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పనిచేశారన్నారు.అటువంటి నేతను కోల్పోవడం తీరని లోటన్నారు. ఆమె స్ఫూర్తితో తర్వాత సర్పంచ్‌లు పనిచేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయడమే ఆమెకు ఇచ్చిన నివాళి అన్నారు. ఈ మేరకు రాజమ్మ పార్థివదేహానికి మండల నాయకులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సీనియర్ నేత తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, కార్యకర్తలు, ఎంపిటిసిలు జయసుధ, అమ్మాజీ, సర్పంచులు నివాళులు, జోహార్లర్పించారు.

మారెమ్మ సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేత సీలేరు 'బి'

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరులో పదిరోజులుగా నిర్వహిస్తున్న మారెమ్మ సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేతగా సీలేరు 'బి' జట్టు నిలిచింది. గతనెల 28 నుంచి ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. సీలేరు ఎ, బి జట్ల మధ్య ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో సీలేరు 'బి' జట్టు జయకేతనం ఎగరేసింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సీలేరు ఎ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 115పరుగులు చేసింది. తర్వాత లక్ష్యసాధనకు దిగిన సీలేరు బి జట్టు టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌లో తడబడడంతో పది పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అనంతరం ఎపి జెన్‌కో ఎఇ సురేష్ సహకారంతో సీలేరు బి జట్టు బ్యాట్స్‌మెన్ జాన్, చక్కని నైపుణ్యాన్ని కనబరిచి, కేవలం 38బంతుల్లోనే 98 పరుగులు చేసి సంచలన విజయం సాధించింది. జాన్‌కు చక్కని సహకారం అందించిన సురేష్, బ్యాటింగ్‌లో సత్తా చాటి టాపర్‌గానిలిచారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మారెమ్మ క్రికెట్ టోర్నీలో విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు ఎపి జెన్‌కో ఎస్ఇ(సివిల్) కెకెవి.ప్రశాంత్‌కుమార్, ఇఇ లక్ష్మినారాయణ, ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ ప్రతినిధి వల్లి ప్రసాద్ బహుమతులను అందజేశారు. విజేత సీలేరు 'బి' జట్టుకు రూ.15వేలు నగదుతోపాటు ట్రోఫీని, రన్నరప్ సీలేరు 'ఎ' జట్టుకు రూ.8వేలు నగదుతోపాటు ట్రోఫీని అందజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా ధార రాజు, ఉత్తమ బౌలర్‌గా యువరాజులను ఎంపిక చేసి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు యంగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నేత శ్యామ్‌సన్ సుందరరావు మాట్లాడుతూ, టోర్నీలో పాల్గొన్న 20జట్లు అత్యుత్తమ ఆటతీరు కనబరిచి, స్థానికులను ఎంతగానో అలరించాయన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన ఎపి జెన్‌కో ఇంజినీర్లు, స్థానికులతోపాటు క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎపిజెన్‌కో అప్పలనాయుడు బాలాజీ లాడ్జి యజమాని నక్క జ్ఞానేశ్వరరావు, టిడిపి నేతలు బొర్రా కృష్ణ, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు సీనియర్ క్రీడాకారులు జాన్ పాల్గొన్నారు.



విజేత సీలేరు 'బి'కి ట్రోఫీ అందజేస్తున్న జెన్‌కో ఎస్ఇ, ఇతర అధికారులు, నేతలు


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిపి

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి గంగవరం నుండి కారిగొడ్డ గ్రామం వరకు రోడ్డు పనులకు సర్పంచ్ సారా సీతయ్య ఆధ్వర్యాన ఎంపిపి శెట్టి నీలవేణి సోమవారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ, కనీస రోడ్డు సౌకర్యం లేక గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపిపి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.ఉపాధి హామీ పథకం కింద సుమారు 6 లక్షల తో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీన, నాయకులు దేముడు, పాల్గొన్నారు.


విజేత జట్టు క్రీడాకారులు

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో మోద కొండమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం హోరాహోరీగా ముగిశాయి. ఫైనల్ పోటీలో హుకుంపేట జట్టు విజయం సాధించింది. క్రీడాకారులను జెడ్పిటిసి రేగం మత్స్యలింగం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. ఓటమి పొందిన క్రీడాకారులను నిరుత్సాహ పడకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివకుమార్, పి.రామయ్య, ఆర్గనైజర్ నైని సత్తిబాబు, క్రొర్రా నాగబాబు, కె.సూరిబాబు పాల్గొన్నారు.

జూ పార్కులో తెల్ల పులి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో కుమారి పేరుగల తెల్ల పులి (19) సోమవారం మృతి చెందినట్టు జూ అధికారులు తెలిపారు. వృద్ధాప్యం కారణంగా మల్టిపుల్ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా మృతి చెందినట్టు జూ వైద్యులు నిర్ధారించారు. అడవిలో పులుల సగటు జీవిత కాలం 12 నుంచి 14 ఏళ్ళ వరకు జీవిస్తుంది. జూ సంరక్షణలో ఉండటంతో కుమారి 19 ఏళ్ళ వరకు జీవించిందని వైద్యులు తెలిపారు. ఈ తెల్ల పులి 2004లో జన్మించింది. 2007లో హైదరాబాద్ నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి వైజాగ్ జూ పార్కుకు తీసుకొచ్చారు. కుమారి వైజాగ్ జూ పార్కులో తన 16 ఏళ్ళ జీవిత కాలంలో మొత్తం 9 తెల్ల పులి పిల్లలకు జన్మనిచ్చింది. మృతి చెందిన కుమారి సంతతి తెల్ల పులులను జంతు మార్పిడి పద్ధతిలో ఇతర జంతు ప్రదర్శన శాలలకు ఇచ్చి అనేక కొత్త జంతువులను విశాఖ జూ పార్కుకు తీసుకొచ్చారు.

గిరిజన సమస్యలపై 11న చేపట్టే...

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి


డుంబ్రిగుడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన సమస్యలపై ఈనెల 11న పాడేరు జిల్లా కేంద్రంలో చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలం కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీ మంత్రివర్గ కేబినెట్ లో చేసిన తీర్మానాలను రద్దు చేయాలన్నారు. అనంతగిరి, చింతపల్లి, జికె వీధి మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేధావులు, ఉద్యోగులు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నూకరాజు, బలరాం, ఆనందరావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోగల కళ్యాణ మండపం వద్ద గిరిజన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 11న చేపట్టే ఛలో కలెక్టరేట్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్కు మాట్లాడుతూ, బోయ/వాల్మీకులను ఎస్టి జాబితాలోకి చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని తక్షణమే వెనక్కి తీసుకొని రద్దు చేయాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, మంచి నీరు, పాఠశాల భవనాల నిర్మాణాలు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నర్సయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి ఎం ఎం శ్రీను, లక్ష్మీపురం సర్పంచ్ కే.త్రినాథ్, భాష వాలంటీర్ల సంఘం నాయకులు కే.కొండయ్య, కే.శ్రీను, భీమన్న, నర్సింగ్ పడాల్, ఆనంధ్, డొంబ్రు తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

ఆర్‌బికె సేవలపై అవగాహన కల్పించండి

జిల్లా ప్రత్యేకాధికారి, ఎపి ఐఐసి ఎండి ప్రవీణ్ కుమార్


మినుములూరులో పర్యటిస్తున్న ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఎపి ఐఐసి ఎండి ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం పాడేరు మండలంలో పర్యటించి మినుములూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న సేవలు, సచివాలయం ద్వారా అందిస్తున్న పౌర సేవలను పారదర్శకంగా అందిం చాలన్నారు. గ్రామ సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీసారు. సచివాలయం సబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మినుములూరు పిహెచ్ సి సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీసారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పిహెచ్‌సిలో గర్భిణీలకు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పరీక్షలను పరిశీలించారు. గర్భిణీలకు ప్రతీ నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నూరు శాతం ఆసుపత్రి ప్రసవాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడి పిఒ వి.అభిషేక్, వెలుగు ఎపిడి వి.మురళి, డిపిఒ కొండలరావు, పిహెచ్ సి వైద్యాధికారి ప్రవీణ్, పాడేరు తహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- దేవరాపల్లి : పాడేరు నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఒక బాలుడుతో పాటు ఇద్దరు యువకుల్ని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి నాగేంద్ర తెలిపారు. శ్రీరాంపురం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురుని అదుపులోకి తీసుకొని సోదా చెయ్యగా, 8 కేజీలు గంజాయి పట్టుబడిందన్నారు. విశాఖ ఎంవిపి కాలనీకి చెందిన గుజ్జు విజయ శివ భార్గవరెడ్డి, గుజ్జు రామతో పాటు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కోరాపుట్ జిల్లా పాడువ మండలం దార్లపూడి గ్రామానికి చెందిన పదహారేళ్ళ బాలుడు గంజాయితో దొరికారన్నారు. ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను చోడవరం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.


కూలిన గృహాలు

భారీ వర్షానికి కూలిన గృహాలు

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలోని గంపరాయి పంచాయతీ అల్లంపుట్టు గ్రామంలో భారీ వర్షానికి సుమారుగా పది గృహాలు నేలమట్టం అయ్యాయి. ప్రాణాపాయం నుండి ప్రజలు సురక్షితంగా బయటపడ్డారు. గృహాలు నేల మట్టం కావడంతో బాధితులు కట్టుబట్టలతో కాలం గడుపుతున్నారు. బాధితులు ఉండడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఆదుకోవాలని పలువురు కోరారు. స్థానిక సర్పంచ్ అచ్చుమ్మ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుండి నష్టపరిహారం చెల్లించేందుకు తనవంతుగా కృషి చేస్తానని హమి ఇచ్చారు. బాధితులను విఆర్వో రత్నకుమారి, మాజీ ఎంపిటిసి, గణపతి, తాంగుల గంగాధరం, మాజీ సర్పంచ్ వంతల కమలాకర్ సందర్శించారు.

11న వైఎస్‌ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- పిఎం పాలెం : పిఎం.పాలెం సమీపంలో ఉన్న ఎసిడి - విడిసిఎ క్రికెట్ స్టేడియం ఆవరణలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విగ్రహావిష్కరణ అనంతరం క్రికెట్ అసోసియేషన్ ప్రముఖులను, ఇటీవల అండర్ 19 క్రికెట్ క్రీడకారులు ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌కి ఎంపికైన వారిని ముఖ్యమంత్రి అభినందిస్తారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ సిహెచ్.గోపినాథ్‌రెడ్డి, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, చిన్న గదిలి తహశీల్దార్ సనపల రమణయ్య, నార్త్ ఎసిపి శివరామిరెడ్డి, 8వ వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు, 5, 6, 7 వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాస్, బొట్ట అప్పలరాజు, పోతిన హనుమంతు, గాదె రోశిరెడ్డి, పోతిన యల్లాజి, పోతిన ప్రసాద్, పిల్లా రమణబాబు, గుంటుబోయిన సంజీవ్, పోతిన మూర్తిబాబు, సింహాచలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, ముందుండి రాజేశ్వరి, పిల్లా సూరిబాబు, జగుపిల్లి నరేష్, కుడితి రామారావు, బైపిల్లి ప్రసాద్, కురిటి లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పిజి బాటిల్ ప్లాంట్‌లో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ములగాడ : హెచ్‌పిసిఎల్ ఎల్‌పిజి బాట్లింగ్ ప్లాంట్‌లో ఓ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... శ్రీహరిపురం పవన్ పుత్రనగర్‌లో పల్లా శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. రోజూమాదిరిగానే సోమవారం 6 గంటలకు విధులకు చేరుకున్నాడు. ఎల్‌పిజి బాట్లింగ్ ప్లాంట్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ సెక్షన్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. తోటి ఉద్యోగులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.14 లక్షలు, ఇంట్లో ఒకరికి లోడింగ్ అన్‌లోడింగ్ విభాగంలో ఉద్యోగం ఇస్తామని యాజమాన్య ప్రతినిధులు అంగీకరించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులు రూ.2 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. దహన సంస్కారాలకు రూ.25 వేలును తోటి ఉద్యోగులు ఇచ్చారు. ఈ చర్చల్లో గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు అప్పలరాజు, కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ.సురేష్, ఎఐటియుసి నాయకులు కసిరెడ్డి సత్యనారాయణమూర్తి, సిపిఐ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పిఒను మర్యాదపూర్వకంగా కలిసిన రాఘవన్

డిఎల్‌పిఒగా రాఘవన్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో పారిశుధ్యానికి ప్రాధాన్యతనిచ్చి పనులు చేపట్టనున్నట్లు రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి జిఎల్ఎన్‌వి రాఘవన్ అన్నారు. సోమవారం నూతన డిఎల్‌పిఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కకుండీని అందజేశారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ భీమడోలు మండలంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ, ప్రమోషన్‌పై రంపచోడవరం డిఎల్‌పిఒగా ప్రభుత్వంనియమించిందన్నారు. గ్రామ సచివాలయాల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొత్త డిఎల్‌పిఒ రాఘవన్‌ను ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, జాన్‌విల్సన్‌ను కలిసి, పుష్పగుచ్ఛంతో అభినందించారు.

11న విశాఖలో సిఎం బిజీబిజీ

- పలు కార్యక్రమాలకు హాజరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

ఈ నెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో బిజీబిజీగా గడపనున్నారు. సిఎం పర్యటన వివరాలను ముఖ్యమంత్రి అదనపు ప్రత్యేక కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో వెల్లడించారు. 11న మధ్యాహ్నం 2:20 గంటలకు గన్నవరం విమానాశ్రయంలో సిఎం బయలుదేరి 3:20కి విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4:00 గంటలకు పిఎం.పాలెంలోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియానికి వస్తారు. అక్కడ బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ప్రారంభిస్తారు. అక్కడ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైఎస్ఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తదుపరి అదే వేదికపై భీమిలి నియోజకవర్గానికి చెందిన స్థానిక నాయకులతో భేటీ అవుతారు. అక్కడి నుంచి 4:50 గంటలకు బయలుదేరి 5:05 గంటలకు ఆరిలోవలో ఉన్న అపోలో హాస్పిటల్స్‌కు చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. రేడియేషన్ పరికరాలను పరిశీలించి అక్కడ కార్యక్రమంలో ప్రసంగిస్తారు.

5:35 గంటలకు బయలుదేరి 5:50 గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకొని అక్కడ నిర్మించిన సీ-హారియర్ మ్యూజియాన్ని, రాంనగర్ వద్ద నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌ను, ఎంవిపి కాలనీలో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలను ప్రారంభించనున్నారు. వీటితోపాటు ఎండాడలో నూతనంగా నిర్మించనున్న కాపు భవన్, భీమిలిలో నిర్మించనున్న ఫిష్ లాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. 6:10 గంటలకు బీచ్ రోడ్డులో ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుని వివాహ వేడుకలో పాల్గొని అనంతరం అక్కడి నుంచి 6:50 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 7:00 గంటలకు విశాఖ నుంచి విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

స్వల్ప వ్యవధిలోనే మళ్లీ పర్యటన

విశాఖకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పర్యటనల తాకిడి పెరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 3న అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన విచ్చేసిన విషయం తెలిసిందే. పది రోజులు కూడా గడవకముందే ఆయన మళ్లీ వస్తున్నారు.

క్షేమంగా రండి..!

మణిపూర్ నుంచి స్వస్థలాలకు పయనమైన యువకులు

ప్రజాశక్తి - కొత్తకోట, పాడేరు టౌన్

మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో అక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు యువకులు స్వస్థలాలకు సోమవారం బయలుదేరారు. దీంతో వారి కుటుంబీకుల్లో కాసింత ఆనందం తొణికిసలాడుతోంది. రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన కొప్పాక జశ్వంత్ మణిపూర్ ఐఐటిలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న అల్లర్లు వల్ల కాలేజీలో బిక్కు బిక్కుమంటూ గడిపాడు. ఇక్కడి నుంచి తల్లిదండ్రులు ఫోన్ చేయగా పరిస్థితులు భయాందోళనగానే ఉన్నాయని వివరించడంతో తల్లిదండ్రులైన కొప్పాక అప్పారావు, ఆదిలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అక్కడ ఉన్న విద్యార్థులందరినీ ప్రత్యేక విమానాల్లో సురక్షితంగా ఎపికి తరలిస్తూ చర్యలు చేపట్టడం కాసింత ఉపశమనం కలిగించింది. అధికారులు జశ్వంత్‌ను కలిసి హైదరాబాద్ విమానం ఎక్కించారు. దీంతో ఆయన కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మణిపూర్ నుంచి బయలుదేరిన అల్లూరి జిల్లా యువకులు

అల్లూరి జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు మణిపూర్‌లో చిక్కుకున్నట్లు అధికారులు గుర్తించారు. చదువు నిమిత్తం వారు అక్కడకు వెళ్లారు. అక్కడ జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడిపారు. తమ పిల్లల్ని క్షేమంగా జిల్లాకు రప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కొన్ని రోజులుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ మేరకు అక్కడ చదువుతున్న ఎపి విద్యార్థులను గుర్తించి వారి వివరాలను అధికారులు సేకరించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండలం నుంచి ఇద్దరు, హుకుంపేట మండలం నుంచి ఒకరు మొత్తం ముగ్గురు ఉన్నట్లు గుర్తించారు. వారిలో ఎన్ఐటి చదువుతున్న హుకుంపేటకు చెందిన కోరుబిల్లి హేమంత్ బాబు, ఐఐటి చదువుతున్న పాడేరు మండలానికి చెందిన బొంతు సాలియంట్ జాయ్సర్, పాంగి అనిల్ కుమార్ ఉన్నట్టు తెలియజేశారు. వీరిని తరలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసింది. దీంతో వారు తమ స్వస్థలాలకు మంగళవారం రాత్రి చేరుకునే అవకాశం ఉంది. తమ పిల్లలు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని తల్లిదండ్రులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

నాణ్యమైన విద్య ఏదీ ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కెజిబివిల్లో బోధనా సిబ్బంది కొరత
పనిచేస్తున్న వారిపై ఒత్తిడి
జీతం తక్కువ కావడంతో మధ్యలోనే మానివేత
పది ఫలితాలపై ప్రభావం

నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి)ల్లో పూర్తిస్థాయి బోధనా సిబ్బందిని ప్రభుత్వం నియమించని ఫలితంగా సరైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. శాశ్వత ప్రాతిపదికన పోస్టులు భర్తీచేయకుండా ఏళ్ల తరబడి సిఆర్‌టి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్, గెస్ట్ ఫ్యాకల్టీ పేర నియమించి సర్కారు కాలం నెట్టుకొస్తోంది. ఖాళీలను విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి భర్తీ చేయకుండా తాత్సారం చేసి విద్యా సంవత్సరం మధ్యలో ఖాళీల భర్తీకి అనుమతిస్తోంది. బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వ నిర్లక్ష్యం పేద పిల్లల విద్యపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడానికి, పది పరీక్షల్లో ప్రధానమైన సబ్జెక్టుల్లో బాలికలు ఫెయిలవడానికి ప్రభుత్వ తప్పిదాలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత బోధనా సిబ్బంది ప్రత్యేకంగా చూపిన శ్రద్ధతో పాసైన విద్యార్థులకు మార్కులు బాగా వచ్చాయి. ఇదే సందర్భంలో బోధన సిబ్బంది కొరతతో ప్రధానమైన సబ్జెక్టుల్లో విద్యార్థులు ఫెయిలయ్యారు. జిల్లాలో 20 కెజిబివిల్లో పది పరీక్షలు రాసిన 750 మంది బాలికల్లో 619 మంది ఉత్తీర్ణులయ్యారు. 131 మంది ఫెయిలయ్యారు. ఒకటి నుంచి రెండు, మూడు సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు వీరిలో ఉన్నారు. 96 మంది ఒక్క లెక్కల్లోనే తప్పారు. అలాగే తెలుగులో 19 మంది, హిందీలో 10, ఇంగ్లీష్‌లో ఇద్దరు, ఫిజికల్ సైన్సులో 33, బయలాజికల్ సైన్సులో 31, సోషల్‌లో 14 మంది తప్పారు. సబ్జెక్టు టీచర్ల భర్తీ నవంబరులో జరిగింది. దాదాపు విద్యా సంవత్సరం అర్థభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించడంతో పాఠ్యాంశాలు పూర్తిచేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పరీక్షలకు సిద్ధంచేసే అవకాశం ఫ్యాకల్టీకి లేకుండాపోయింది.

ఫలితాలపై ప్రభావం ఇలా..


చీడికాడ కెజిబివిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి, రాంబిల్లి కెజిబివి 59 శాతానికి పరిమితం కావడానికి ఈ కింది అంశాలు కారణంగా ఉన్నాయి. చీడికాడ కెజిబివిలో ఇంగ్లీష్, బయలాజికల్ సైన్సు ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులకు బోధన సమస్య లేకుండా నవంబరులో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించే వరకు ప్రిన్సిపాల్ ఇంగ్లీష్ బోధించగా, సోషల్ టీచర్ బయాలజీ బోధించారు. దీంతో ఇక్కడ మంచి ఫలితాలు వచ్చాయి.

రాంబిల్లి కెజిబివిలో లెక్కలు టీచర్ మెడికల్ లీవ్ పెట్టారు. ఫిజికల్ సైన్సు, హిందీ టీచర్లను కొంతకాలం తరువాత నియమించినప్పటికీ ఫిజికల్ సైన్సు టీచర్ రెండు నెలలు పనిచేసి మానేశారు. లెక్కలు బోధించే టీచర్‌ను జనవరి నుంచి సర్దుబాటు చేశారు. ఫిజికల్ సైన్సు క్లాసుల బోధన సరిగా జరగలేదు. ఇక్కడ ప్రిన్సిపాల్ లేకపోవడంతో బయాలజీ టీచర్‌కు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించారు. విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను గెస్ట్ ఫ్యాకల్టీగా కేవలం రూ.12,500 జీతానికి మాత్రమే నియమిస్తుండటంతో వారు ఆసక్తి చూపడంలేదు. గెస్ట్ ఫ్యాకల్టీగా కొద్ది రోజుల పనిచేసినా ఇంటి నుంచి స్కూల్‌కు వచ్చేపోయేందుకు ఆ జీతం సరిపోకపోవడంతో మధ్యలోనే వారు మానేస్తున్నారు. ఈ పరిస్థితి కెజిబివిల్లో గతంలోనూ ఉత్పన్నమైంది. అయినప్పటికీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టలేదు. మరోపక్క ఎంతో కాలంగా పనిచేస్తున్న బోధనా సిబ్బందికి ఇతర పాఠశాలల రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా జీతం ఇవ్వడంలేదు. ఉద్యోగ భద్రత, సరైన జీతం లేకపోవడంతో పూర్తిస్థాయిలో పనిచేయడానికి బోధన సిబ్బంది ముందుకు రావడంలేదు. దీంతో పేద విద్యార్థుల పరీక్షలపై ఈ ప్రభావం పడుతోంది.


వినతులు స్వీకరిస్తున్న పిఒ సూరజ్ గనోరే

'స్పందన'కు 37 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలతో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావుతో కలిసి, స్పందన నిర్వహించి, వినతులు స్వీకరించారు.
ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ 37 దరఖాస్తులు వచ్చాయన్నారురంపచోడవరం మండలం ఆకూరు గ్రామంలో రబ్బర్ ప్రాసెసింగ్ మిషన్ మంజూరు చేయాలని మడి మురళీకష్ణ దొర, అరగటి సుగ్గిరెడ్డి, 12మంది గిరిజన రైతులు దరఖాస్తు సమర్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తనను ఆదుకోవాలని అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామానికి చెందిన సింతోజీ పెద్ద అప్పారావు విన్నవించారు. కార్యక్రమంలో ఇఇలు జి.డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శీనివాసరావు. పి హెచ్‌ఒ చిట్టిబాబు, పిఎఒ రాంబాబు, సిడిపిఒ సంధ్యారాణి, ఎఎంఒ సి.శ్రీహరి. వైద్యాధికారులు డాక్టర్ రాధిక, ప్రేమ్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ గోపిక, డిఇఇలు సాయిసతీష్ ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్రబాబు, రామచంద్రమూర్తి, ఎడిఎ సిహెచ్‌కెవి చౌదరి, సావిత్రి, మలేరియా అధికారి రామకృష్ణ, ఎఇలు శ్రీనివాసరావు, వంశీ, డిటి చైతన్య బాబు, .డిడి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, జిసిసి సీనియర్ మేనేజర్ ఎం.నాగరాజురెడ్డి. లీగల్ సెల్ న్యాయవాది ఎంపీ సత్యనారాయణ పాల్గొన్నారు,


ఆర్థికసాయం అందజేస్తున్న సిఐ బాజీలాల్

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: స్థానిక పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండపల్లిగ్రామానికి చెందిన సత్యనారాయణ దొర కుటుంబానికి స్థానిక సిఐ బాజీలాల్, రాజవొమ్మంగి ఎస్ఐ టిజి. నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది సోమవారం రూ. ఒక లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్‌బి హెచ్‌సి దుర్గారావు, మహర్షి ఇతర పోలీసుల సహాయంతో సమకూర్చిన విరాళాన్ని సత్యనారాయణ దొర భార్య, కుటుంబ సభ్యులకు రాజవొమ్మంగి సిఐ ఎస్‌కె. బాజీలాల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సి రాజారావు పాల్గొన్నారు.

పిడుగు పడి పశువులు మృతి

ప్రజాశక్తి -మారేడుమిల్లి:మండలంలో ఆదివారం రాత్రి పిడుగుపడి మూడు పశువులు మృతి చెందాయి. మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ దేవరపల్లి గ్రామానికి చెందిన రైతు కొండ్ల బాలురెడ్డికి చెందిన ఒక ఆవు, రెండు ఎద్దులు పిడుకుపాడుకు మృతి చెందాయని సోమవారం తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని కోరాడు.